క్లుప్తంగా

903 గృహ నిర్మాణాలకు అనుమతులు

కారెంపూడి : స్థానిక వినుకొండ రోడ్డులో వైఎస్సార్ జగనన్న కాలనీలో నివేశన స్థలాలు పొందిన 903 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని, పేదవాడి సొంతింటి కల నెరవేరే తరుణం వచ్చిందని పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నాలుగు బోర్లు మంజూరు చేశారని, బోర్లు వేసి నీటి సౌకర్యం కల్పించగానే త్వరలోనే గృహ నిర్మాణాలు ప్రారంభమౌతాయని పేర్కొన్నారు. పట్టాలు పొందిన వారంతా పట్టా జిరాక్స్ కాపీలు మండల హౌసింగ్ శాఖ కార్యాలయంలో అందించాలని కోరారు. వారందరికి కూడా పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ద్వారా ఇళ్లను ప్రభుత్వం నిర్మించి ఇస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పట్టాలు పొందిన వారు తమ స్థలాలను బాగు చేసుకునే పనిలో ఉన్నారు.

రేపు హైస్కూల్‌లో భవనం ప్రారంభం

దాచేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆధునికీకరణ చేసిన ఉపాధ్యాయుల కార్యాలయ భవనాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ శివశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెన్రీ క్రిష్టినా తదతరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

మాచర్ల: మే 13వ తేదీనా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని మాచర్ల సివిల్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని జూనియర్ సివిల్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ సి మధు బాబు సోమవారం తెలిపారు. రాజీ పడదగ్గ కేసులను పరిష్కరించేందుకు ఉన్నత కోర్టుల ఆదేశాల ప్రకారం మే నెల 13న ఉదయం 10గం''ల నుంచి సాయంత్రం 5గ''ల వరకు లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, భరణం, గృహ హింస, రెవెన్యూ విభాగాలు, క్రిమినల్ కేసులును పరిష్కరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ పూర్వకంగా కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. లోక్ అదాలత్‌లో పలు వివాదాలను రాత పూర్వకంగా పరిష్కరించుకునే అవకాశాన్ని గమనించాలన్నారు.

ఒకే విడతలో పన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ

మాచర్ల: పట్టణంలోని ఆస్థి పన్ను చెల్లింపుదారులు 2023-24సం''రానికి సంబంధించి ఈ నెల 31వ తేదీ లోపు పన్నులు చెల్లిస్తే 5శాతం రాయితీ పొందవచ్చునని మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు సోమవారం తెలిపారు. తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2023-24సం''రానికి గాను ఖాళీ స్థలాలు, ఇంటి పన్నులు, నీటి పన్నులు సకాలంలో మొత్తం ఒకే విడతలో చెల్లిస్తే 5శాతం రాయితీ లభిస్తోందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పురపాలక సంఘంలోని ప్రజలు సద్వినియోగం చేసుకుని పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

దాచేపల్లి : పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి అన్నారు. మండలంలోని మాదినపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సొసైటీ చైర్మన్ లింగారెడ్డి మాట్లాడుతూ..నాడు-నేడు పథకం ద్వారా రూ.18 లక్షల వ్యయంతో ఈ పాఠశాలలో అభివృద్ధి పనులు జరిగాయని, విద్యార్థులు చదువుకునేందుకు అన్ని వసతులను ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ పాఠశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను త్వరలో చేపడుతామని ఆయన చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, సర్పంచ్ అనుముల అంజిరెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరారెడ్డి, మాజీ సర్పంచ్ తాటిపర్తి నర్సిరెడ్డి, నాయకులు అనుముల రామిరెడ్డి, చింతల దానియేలు, ఐలాపురం నరసింహారావు, ఉపాధ్యాయులు లక్ష్మీగౌరి, నాగులమీరా, శ్రీలక్ష్మీ, సీఆర్పీ అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

రొంపిచర్ల: స్థానిక అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని వార్డ్ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. క్వింటాళ్లకు రూ.1962ల ధర చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ క్రాప్ చేయించుకున్న రైతులు వారివారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వారి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని మొక్కజొన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండాలి



రెంటచింతల్లో జగనన్నే మా భవిష్యత్ కార్డులను వృద్ధురాలికి అందిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



ఒప్పిచర్లలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శ్రీనివాసరెడ్డి,పార్టీ నేతలు



జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్న ఇంటింటి ప్రచారం చేస్తున్న పార్టీ నేతలు

కారెంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన అందిస్తూ పేద వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్నారని అలాంటి మంచి సీఎంకు అందరూ కూడా మద్దతుగా నిలవాలని ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య కోరారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్ల వెంట వారు కూడా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలు అవి అందుతున్న తీరుపై ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. తమకు జగనన్న బాగానే మేలు చేస్తున్నారయ్యా..మేము జగనన్నకే మద్దతు ఇస్తామని ప్రజలు స్పందించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాల నుంచి మంచి స్పందన వస్తోంది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణకొండలు, మాజీ సర్పంచ్ రామదేని ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్య, పంగులూరి బుచ్చెయ్య, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వర్‌రెడ్డి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెంటచింతల: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 94 శాతం అమలు చేస్తూ అనేక సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజల జీవితాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం రెంటచింతలలో గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో కలిసి ఆమె ఇంటింటికి తిరుగుతూ సీఎం జగన్ ఇచ్చినమాట తప్పకుండా ప్రజల శ్రేయస్సు కోసం చెప్పిన సమయానికి సంక్షేమ ఫలాలను అందజేస్తున్నట్లు వివరిస్తూ మాట్లాడారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు ఎవరికైన అందడంలేదా...ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి మీ సమస్యలను తెలుసుకుంటూ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారా...చేపట్టిన జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అంటిస్తూ ముఖ్యమంత్రి జగన్ కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలను అమలుచేయడం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా గృహసారథులు, కన్వీనర్లు అంకిత భావంతో కృషిచేస్తూ గ్రామాలలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో గృహ వలంటీర్లు, సారథులు లక్ష్మారెడ్డి, బూసిరెడ్డి, గూలి వెంకటరెడ్డి, కొండాటి రాజు, గుండా కిశోర్, కర్నాటి గోపి, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల: పట్టణంలోని 31వ వార్డులో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన నాయకుడు పిన్నెల్లి తేజ, కౌన్సిలర్ వేల్పుల గురవయ్య, కన్వీనర్, గృహసారథులు ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరిగి స్టిక్కర్లును అంటించి బుక్‌లెట్‌లు అందజేశారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తూ పేదల పెన్నిధిగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సాయాన్ని గుర్తించి మరోసారి జే జేలు పలకాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే చేరుస్తూన్నారన్నారు. ప్రతి ఒక్కరికీ అభివృద్ధి పథకాల గురించి వివరిస్తున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధికి, సీఎం జగన్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను తేడాను ప్రజలకు వివరించారు. ప్రస్తుతం సీఎం జగన్ నిరంతరం రాష్ట్రాభివృద్ధికి పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌ను తిరిగి గెలిపించుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలందించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిన్నెల్లి మదనమోహన్‌రెడ్డి, నట్టువ రాధాకృష్ణ, కందుకూరి రత్నరాజు, ముక్కాల కోటిరెడ్డి, మోదుగుల వెంకటరెడ్డి, సునిల్, కంభంపాటి మోషే, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గురజాల : రాష్ట్ర అభివృద్ధి ప్రదాత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని నరసరావుపేట పార్లమెంటరీ మహిళా నాయకురాలు మహంకాళీ యశోద దుర్గా అన్నారు. లక్ష్మీనగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే మా జగనన్న కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలు గురించి వివరించారు. కార్యక్రమంలో దేవండ్ల నీలంరాజు, అదే విధంగా నగర పంచాయతీ విప్ కుక్కమూడి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గంగవరంలో పీర్ అహ్మద్, చలవాది నారాయణ ఆధ్వర్యంలో, చర్లగుడిపాడు గ్రామంలో వైస్ ఎంపీపీ వేముల చలమయ్య, కావూరి అంజిబాబుల ఆధ్వర్యంలో మాడుగులలో మాచర్ల బాబు, సాగర్, అధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీకి రెండు కళ్లు

- విషప్రచారాన్ని తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారులకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: ప్రభుత్వ పాలనపై ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా చేస్తున్న విషప్రచారాన్ని తిప్పి కొట్టాలని గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరాలపాడు గ్రామ సచివాలయ పరిధిలోని ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామంలోకి విచ్చేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి పథకాల లబ్ధిపై స్థానికులను అడుగుతుండగా అందరు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు మాత్రం తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఒక పక్క సంక్షేమము, ఒక పక్క అభివృద్ధి రెండింటిని సమానంగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. దేశ చరిత్రలో ఏరాష్ట్రానికి లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చారని ఆయన అన్నారు. నేడు మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రజలకు పాలన సౌలభ్యంతోపాటు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే ఉన్నతమైన లక్ష్యంతో మెరుగైన పాలనను ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ఈ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామీణ పేద వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న ఇంటి పట్టాలు, రైతు భరోసా ప్రతి పథకంలో అర్హులైన వారికి చేరుతుందన్నారు. ఇలాంటి పథకం డైరెక్ట్‌గా ప్రజలకు అందుతుందన్నారు. దళారులు ఎక్కడా లేదన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు, దళారులు ఉండేవారని, ప్రస్తుత పథకాలను పొందేవారని, నేడు ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయన్నారు. గ్రామ సచివాలయ వలంటీర్ల సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. గత పాలన, ప్రస్తుత పాలనలను ప్రజలు ప్రత్యక్షంగా చూశారని, ప్రజాస్వామ్యంలో మంచి చేసిన వారికే ప్రజలు ఓట్లు వేస్తారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చల్లా శివారెడ్డి, గడ్డం వలి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, వైఎస్ ఎంపీపీలు గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సాతులూరి బాబు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తార్‌సీతరామిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నంబూరి పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, పల్నాడు యువజన విభాగ పల్నాడు ప్రధాన కార్యదర్శి ఇల్లూరి వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ అన్నబోతుల గురవారెడ్డి, ముడేల శ్రీనివాస్‌రెడ్డి, ముడేల సుబ్బారెడ్డి, మద్దసాని రమణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ భూమిరెడ్డి యల్లారెడ్డి, గ్రామ కన్వీనర్ అబ్దుల్లా, మాబు, వలి, బుర్రి వెంగళరెడ్డి, ఇల్లూరి పుల్లారెడ్డి, ముడేల వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈద్గాలో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ముస్లింల పవిత్ర రంజాన్‌మాసంలో రంజాన్‌రోజు చేసుకునే నమాజ్‌కు కావాల్సిన ఏర్పాట్లను కల్పిస్తామని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలియజేశారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న ఈద్గాను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సోమవారం హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన రంజాన్‌పండుగ పురస్కరించుకుని ముస్లింలు చేసుకునే నమాజ్ ప్రార్ధనలకు కావల్సిన ఏర్పాట్లును నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. నమాజ్ వేళలో ఈద్గా వద్ద టెంటు అలాగే మంచినీరు అలాగే మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెట్లతో నిండి ఉన్న ప్రాంగణాన్ని శుభ్రం చేయడం జరిగిందన్నారు. ముస్లింలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడంలో ఎక్కడా రాజీ పడేదేలేదని ముస్లింలందరూ ప్రశాంతంగా నమాజ్ చేసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేయబోతున్నామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ గఫార్, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ అబ్దుల్లా, షేక్ కరిముల్లా, షేక్ సైదావలి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, ఎండీ లతీఫ్, ముస్లిం మత పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రాల పంపిణీ



హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

కారెంపూడి: కారెంపూడి తండా వాసులకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రాలను స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. తండాలో నివసిస్తున్న 65 కుటుంబాలకు చెందిన ఇళ్లకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ కుటుంబ యజమాని పేరుతో ప్రభుత్వం మంజూరు చేసిన హక్కు పత్రాలను వారు పంపిణీ చేశారు. ఇంకా 15 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటికి కూడా త్వరలోనే హక్కు పత్రాలు వస్తాయని గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి

తేజానాయక్, జెడ్పీటీసీ షేక్ షఫీ తెలిపారు. 2006లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తండా వాసులకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తే ప్రస్తుతం వారి తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారు నివసిస్తున్న ఆ ఇళ్లపై సంపూర్ణ హక్కులు కలిపించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, వైఎస్సార్ సీపీ నాయకులు కరాలపాటి సుబ్బారావు, వేముల లింగయ్య, చల్లా వీర్లవరప్రసాదరావు, పాతూరి రామిరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, అంతరగడ్డ ఏసోబు, కృష్టా నాయక్ పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పిడుగురాళ్ల: ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, జెవివి ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను పిడుగురాళ్ల పట్టణంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారధి అన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు విద్యా రంగ సమస్యలు విద్యార్థుల హక్కులపై పోరాడుతూ పేద విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. విద్యార్థులందరూ కోచింగ్ సెంటర్‌ని వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీం పీరా, ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు ఎంవి సాంబశివరావు, దయాకర్, జమాల్, కెవిఎస్ ప్రసాద్, ఎస్‌కే బాజీ, ఎస్ఎఫ్ఐ విద్యార్థులు తదితులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



విద్యార్థులకు ప్రకృతి పాఠం చెబుతున్న జాజి

కారెంపూడి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ప్రకృతి ప్రేమికుడు కొమెర అంకారావు (జాజి) స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన ప్రకృతి పాఠశాల కార్యక్రమంలో చెప్పారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అలాగే అడవుల ఉపయోగాలను అవి సమస్త జీవరాశికి చేస్తున్న మేలును గుర్తించాలని అవి లేకుంటే మానవాళి మనుగడ లేదనే వాస్తవాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ కూడా పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకోవాలన్నారు. వచ్చే వర్షాకాలంలో సీడ్ బాల్స్ తయారు చేసి అవి మొక్కలుగా ఎదిగేందుకు విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే లక్షలాది మంది విద్యార్థులకు ప్రకృతి పాఠాలు బోధించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలనే చైతన్యం విద్యార్థుల్లో చాలా బాగా వ్యక్తం అవుతోందన్నారు. దీనికి ప్రతి విద్యార్థి ఒక్క మొక్క నాటి దానిని సంరక్షణ చేస్తే సరిపోతుందన్నారు. ఈ సందర్భంగా జాజి రాసిన ప్రకృతి వైద్యం పుస్తకాన్ని గ్రంథాలయ అధికారి పులిబండ్ల గోపి, బాల సాహితీవేత్త మాన్‌సింగ్‌నాయక్ ఆవిష్కరించి జాజిని సన్మానించారు. ప్రకృతి వైద్యం పుస్తకాలను గ్రంథాలయానికి జాజి బహూకరించారు.

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఏఓ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు రైతుభరోసా పొందని రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్సార్ రైతు భరోసా 2023-24 కోసం ఈ నెల 30వ తేదీలోగా రైతుభరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన కొత్తగా పంటపొలాలు కొనుగోలు చేసినవారు, పూర్వీకుల నుంచి వారసత్వంగా పొందిన పొలాలను రిజిస్టర్ చేయించుకున్నవారు, ఇప్పటి వరకు రైతుభరోసా పథకం పొందని వారు ఈ నెల 30 నాటికి వారి పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు వారికి సంబంధించిన ఆధార్‌కార్డు, పొలం పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ పాస్‌పుస్తకం నకళ్ళ(జిరాక్స్)తో రైతుభరోసా కేంద్రాలకు వెళ్లాలని ఆయన కోరారు.

28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

రెంటచింతల: స్థానిక ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వివిధ తరగతుల్లో ఇంగ్లిష్ మీడియంలో 2023-24 విద్యాసంవత్సరం ప్రవేశం కోరు బాలురు ఈ నెల 28వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్ మోహన్ కోరారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రిన్సిపల్ మోహన్ మాట్లాడుతూ ఖాళీలను తరగతుల వారిగా రోస్టర్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓసిలకు 2 శాతం, పీహెచ్‌సీలకు 3 శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. 5వ తరగతిలో 50 ఖాళీలు, 6వ తరగతిలో మూడు ఖాళీలు, 9వ తరగతిలో 10 ఖాళీలు ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29వ తేదీన పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ నకలు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, రేషన్‌కార్డును జత చేసి అందజేయాలన్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో విద్య బోధించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు : 9951640484 సంప్రదించాలని ఆయన కోరారు.

జగనన్న కాలనీ లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తాం

ఆర్డీఓ అద్దయ్య



దాచేపల్లిలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ అద్దయ్య

దాచేపల్లి : జగనన్న కాలనీలో మూడవ లేఅవుట్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని గురజాల ఆర్డీఓ కె. అద్దయ్య అన్నారు. దాచేపల్లిలోని జగనన్న కాలనీ మూడవ లేఅవుట్‌లో 1500 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో పేదలకు కేటాయించే స్థలాన్ని ఆర్డీఓ అద్దయ్య సోమవారం పరిశీలించారు. ఈ స్థలానికి సంబంధించిన లేఅవుట్‌ను పరిశీలించి అభివృద్ధిపై చర్చించారు. మూడవ విడతలో ఇంటి పట్టా ఇచ్చేందుకు గుర్తించిన లబ్ధిదారులకు కేటాయించే స్థలాన్ని అభివృద్ధిపై దృష్టిసారించామని, త్వరలో బాగు చేసి ఇంటి పట్టాలు ఇస్తామని ఆయన చెప్పారు. అనంతరం మొదటి, రెండవ విడతలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలు పరిశీలన చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆప్షన్-3 ద్వారా జరుగుతున్న ఇంటి నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యను ఆదేశించారు. ఈ పరిశీలనలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, సర్వేయర్ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది అనిల్, సాంబశివరావు, వీఆర్వో ప్రభాకర్‌రావు తదితరులున్నారు.

నేడు చెన్నకేశవ స్వామి 16రోజుల పండుగ



శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి వారి మూలవిరాట్

మాచర్ల: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారి దంపతులకు 16 రోజుల పండుగ మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, పవళింపు సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు అధ్యక్షుడు గోపవరపు నాగేశ్వరరావు, ఈఓ ఐ సాంబయ్యలు సోమవారం తెలిపారు. స్వామి వారికి పలు పుష్పాలతో ముగింపు ఉత్సవ కార్యక్రమం జరుపుతామన్నారు. అనంతరం భక్తులకు భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లా రీజనల్ యువజన విభాగం కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డిలు హాజరవుతారని చెప్పారు.

1వ వార్డులో పైపులైన్ పనులు



పైపులైన్ పనులు చేస్తున్న సిబ్బంది

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని 1వ వార్డులో పైపులైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 1వ వార్డులోని ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.10 లక్షల నిధులను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో మంజూరు అయ్యాయి. దీంతో ఈ పనులు నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. వార్డులోని అన్ని వీధుల్లో పైపులైన్లు వేసి వెల్డింగ్ పనులు చేస్తున్నారు. ప్రజలకు అవసరమైన ప్రదేశంలో కుళాయి ఏర్పాటు చేశారు. త్వరలో పైపులైన్ పనులు పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందిస్తామని కౌన్సిలర్ క్రాంతికుమార్ చెప్పారు. ఈ పనులను కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పల్లెల్లో పూర్తిస్థాయి వైద్యం



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యుడు కేవీ ప్రవీణ్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పల్లెల్లో పూర్తిస్థాయి వైద్యం అందుతుందని కరపాలపాడు ఆరోగ్య ఉప కేంద్రం వైద్యులు కేవీ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో వైద్యసేవలన్నీ విలేజ్ హెల్త్ క్లీనిక్ ద్వారా అందుబాటులోకి వస్తాయని అన్నారు. దీని ద్వారా పల్లెల్లో ఎంతో మందికి ఉచితంగా వైద్యం అందుతుందని, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 104 సేవలు, ఉచితంగా మందులను అందిస్తున్నామన్నారు. ఆధునిక వైద్యం మీ ఇంటి వద్దకే తీసుకుని వస్తున్నామని, దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం మండల పరిషత్ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. వారికి అవసరమైన మందులను అందించారు. 400 మందికి ఉచితంగా వైద్యసేవలు అందించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు కొండలు, సౌరులు, సీహెచ్‌వో ప్రవళిక, ఎంపీహెచ్‌వో సురేశ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ నూతన కమిషనర్‌ను కలిసిన ఈఓ

దుర్గి: రాష్ట్ర దేవదాయ శాఖ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్ సత్యనారాయణను సోమవారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అడిగొప్పలలో వేంచేసి ఉన్న శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ అభివృద్ధిని భవిష్యత్తు కార్యాచరణను వివరించినట్లు ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనలు, సలహాలతో ఆలయం సర్వతోముఖాభివృద్ధికి తీసుకున్న చర్యలను తెలియజేసినట్లు వివరించారు. అనంతరం శ్రీనిదానంపాటి లక్ష్మీ అమ్మవరి చిత్రపటాన్ని ఆయనకు బహూకరించి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. పలువురు ఈఓలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యకర్మంలో ఈఓలు సత్య ప్రసాద్, కృష్ణారెడ్డి, సత్యవతి పాల్గొన్నారు.